


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

**122**

**(8 ఫిబ్రవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**ఉదయించే** సూర్యుడు వూరికే రాడు. ఏవో క్రొత్త రంగాలు సృష్టించుకు వస్తాడు. కాలం ప్రవాహంగా నడుస్తున్నా ఏ రోజుకారోజు ఎన్ని క్రొత్త విషయాలు? పత్రిక తీసినా, రేడియో తిప్పినా, ఎన్నెన్నో విచిత్రాలు, విడ్డూరాలు, వివాదాలు, వినోదాలు కనిపిస్తాయి.

ఒక దేశంలో యుద్ధం ప్రారంభమవుతుంది. చిన్నపిల్లలు ఏ బొంగరం కోసమో కొట్టుకున్న దానికంటే తేలిగ్గా ఒకదేశంలో ప్రభుత్వం కూలిపోతుంది. పిల్లి చల్ల తప్పాలా పడగొట్టిన దానికన్నా సులువుగా ఒక చోట ఎవరో మహానుభావుడు రాలిపోతాడు. ఎండు ఆకు కన్నా అల్పంగా ఒక వ్యక్తి మహానాయకుడుగా అవతరిస్తాడు. కొమ్ముల పొట్టేలు కంటే దర్పంగా.

ఎన్ని మార్పులో, ఎన్ని విచిత్రాలో, ఎన్ని అవకతవకలో, ఎన్ని అదుపులో, ఎన్ని చీకటి మెరుపులో. అయినా జీవితాలు గడిచిపోతూనే వుంటాయి. సంఘం సకిలిస్తూనే వుంటుంది. ప్రభుత్వాలు జబ్బులు చరుచుకుంటూనే వుంటాయి. రేవులో ఏంవుందో మనం చూపుకేం అందుతుంది.

ఒక ప్రాంతంలో ఒక మహనీయుడో మధ్యతరగతి వాడో నిరాహార దీక్ష వహిస్తాడు. ఎక్కడో ప్రజలు కొందరు విజృంభించి రాళ్ళు రువ్వుతారు. రైళ్ళు ఆపుతారు. పోలీసులు లాటీలు ఉపయోగిస్తారు. భాష్పవాయువు ప్రయోగిస్తారు. అదుపులోకి రాకపోతే కాల్పులు జరుపుతారు. ఆయా ప్రాంతాలలో వారికవి భయానక దృశ్యాలు, తక్కిన వాళ్ళకు దుర్వార్తలు.

మొన్న మైసూరు రాష్ట్రంలో ఒక స్వామి కత్తితీసి ఇద్దర్ని హత్య చేసి చక్కా వచ్చాడు. తనే పోలీసులకు స్వాధీనమయ్యాడు. చాలా మహత్యాలుగల స్వామి. అగ్నికణాలమీద అలాగ్గా నడిచి వెళ్ళగలడట. అనేకమంది ఆ దృశ్యం చూసి ఆయన శక్తికి ఆశ్చర్యపోయారట. ఇంతలో ఆయన తమ్ముణ్ణి ఎవరో కొడుతున్నారని వార్త వచ్చిందిట. సరాసరి వెళ్ళి ఇద్దర్ని హత్యచేసి చక్కా వచ్చాడు. స్వామిలో "హంతకుడు" దాగివున్న సత్యం ఎవరికి తెలుస్తుంది.

మృత్యుదేవత అనేకమంది వ్యక్తులలో రుగ్మతలలో, విషాల్లో, కారులలో దాగి తన కార్పణ్యం బయట పెడుతోంది. ఉదయించే సూర్యుడు ఎవర్ని వూరిస్తాడో, ఎవళ్ళ ఆయువు పూరిస్తాడో తెలుసుకోవడం ఎవరికి సాధ్యం.

దేశంలో గొడవలకు అంతుండదు. అవన్నీ పత్రికలలో వస్తూనే వుంటాయి. క్రోడీకరిస్తే గుండెలు బరువెక్కుతాయి. చూచి ఒక్కసారి నిట్టూర్చడం తప్ప చేసేదేం వుండదు. ఇక సంసారాల విషయంలోకి వస్తే "తెల్లారి లేస్తే వెయ్యి జాతర్లు" అనే సామెత జ్ఞాపకం రాకపోదు. అందులో మధ్యతరగతి బీద కుటుంబాల సంగతి ఎలా వర్ణించడం.

ఏ రోజు భూకం వచ్చి పడుతుందో తెలియదు. అంటే అప్పులవాళ్ళు. అప్పులు చెయ్యందే గుప్పెడు మెతుకులు తినే ప్రాప్తం వుండదు. అవి తీర్చందే వాకిలి తలుపు రీవిగా తెరిచే ప్రాప్తంవుండదు. ముష్టివాడు కేకవేసినా అప్పులవాడనుకుని మూర్ఛపోవడమే ముందు జరిగే పని.

రాత్రి పదకొండు దాటి సిమ్మెంటు ఫ్యాక్టరీ కూతకూసిన తర్వాత "అమ్మయ్య ఇవ్వాళ సూర్యభగవానుడు మంచివేళే బయలుదేరాడు. రేపు ఎలాటి సమయంలో బయలుదేరతాడో. " అనుకోవడం జరుగుతుంది.

ఇంట్లో ఏ మాత్రం ఠికాణా లేని వాళ్ళు అనుకుంటూ వుంటారు. అర్ధరాత్రివేళ కూర్చుని "తెల్లారుతుందని తెలుసుగాని, తెల్లారిన తర్వాత ఏం చెయ్యాలో ఎలా కాలం గడపాలో తెలియదు. అంతా ఆ పరమేశ్వరుడి దయ" అని.

ఇలాటి నైరాశ్యంలో మునిగివుండే వాళ్ళే "తూర్పు తెల్లారినా మార్పేం వుండదు జీవితానికి. ఆ భగవంతుడు దయ తలిచేదాకా అన్న ఉదయాలు ఒకటే" అనుకుంటూ వుంటారు.

"తెల్లారుతున్నదంటే భయం వేస్తోంది ఏడున్నర జీతం కట్టాలి పిల్లాడికి. చేతులో ఏడు నయాపైసలు లేవు. తెల్లారేటప్పటికి ఏ దానకర్ణుడొచ్చి దర్వాజా దగ్గిర ముందుంటాడు కావలసింది ఇచ్చిపోవడానికి? దానాలతో దరిద్రాలు తీరవు. మౌనాలతో మోక్షం రాదు" అని నిశిరాత్రి గాఢనిశ్వాసాలు విడుస్తూ కూర్చునే వారెందరుండరు? ఇలాటి సంఘటనలు గుండెల్లో భూకంపాలుకాక ఏమవుతాయి? ఇలాటి వారికి తెల్లారుతుందంటే ఎంత భయం?

"తెల్లారితే ఇంట్లో చిట్టెడు ఉప్పులేదు. ఎట్లాగో జీవించడం ఇలాంటి జీవుల్ని ఎందుకు పుట్టించడం ఓ పుణ్య పురుషా! ఎందుకు తెల్లారుస్తావు? బ్రతుకులో చీకటికంటె ఇది గొప్పదనా ప్రభూ!" అని అర్ధరాత్రి వేళ ముకిళిత హస్తాలతో అశ్రువులు రాల్చే వారెందరుంటారు. తూర్పు రేకలు వారి కడుపులో రంపపుకోత కోయవు.

ప్రతిరోజూ తెల్లవారు ఝూమున కోడి కూస్తుంది. అది ఒక విధమైన హెచ్చరికగా వినిపిస్తుంది వారివారి అనుభవాలను బట్టి ఆ హెచ్చరిక అర్ధమవుతూ వుంటుంది. లేనివాళ్ళు విని ఇలా అనుకుంటారు.

"కోడికేం కోడి కూస్తుంది. దానికేం తెలుస్తుంది మన బాధ? సిరి సంపదలతో తులతూగే వారికి సూర్యోదయం శుభోదయంగా ఉంటుంది. మావంటి వారికి 'కళ్ళు తెరిచేం చేస్తావు? వళ్ళు విరిచేంచేస్తావు? అలా పడుండు. కడుపులో ఏమీలేందే గడప ఎలా దాటతావు?' అని హెచ్చరించినట్లుంటుంది.

కష్టాల్లో మునిగి కళ్ళు లోతుకుపోయి తెల్లారితే నవ్వుతూ లేచే అవకాశం లేక, పాత దుప్పటి కప్పుకుని పడివున్న ఇల్లాల్ని "ఒసేవ్ లేవవా? బారెడు ప్రొద్దెక్కింది ఆ చారెడు కళ్ళు తెరవ్వే" అనాడుట.

దానికా యిల్లాలు దుప్పటిలో నుంచే జవాబు చెప్పిందట. "తెల్లారితే తామరలు వికసిస్తాయి కాని, తమ ఇల్లాలి కళ్ళు ఎలా వికసిస్తాయి. ఉదయాస్తమయాలతో నిమిత్తంలేని ఉలిపికట్టె జీవితమిది ఏం చెయ్యమంటారు?" అని.

కొందరు రేపు అనే పదానికి బదులు తెల్లారితే అంటూ వుంటారు. ఈ మాట ఎంతో అర్ధవంతంగా వినిపిస్తుంది. ఈరోజు నిర్వర్తించవలసిన బాధ్యతలన్నీ నిర్వర్తించి కొంచెం హాయిగా నిద్రపోయి తెల్లారిన తర్వాత కనిపిస్తానన్నట్లుంటుంది. ఇంకా కొంచెం వేదాంతంలోకి పోతే.

"ఇవాళ్టికి భగవంతుడు రక్షించి కాపాడితే ఎప్పటికి మల్లే లేచి సూర్యుడికి ఎదురుగా నిలబడగలిగితే, తప్పకుండా వచ్చి కనిపిస్తా. లేకపోతే చెప్పలేను. అంతా ఆ భగవంతుని దయ" అన్నట్లు కూడా ఒకప్పుడు ధ్వనిస్తుంది.

"ఉదయించే సూర్యుడు వూరికే రాడు. ఏవో కొత్త రంగులులు సృష్టించుకు వస్తాడు అనేది అందరి హృదయాలలో మెదులుతూనే ఉంటుంది. ఆ సూర్యభగవానుడికి లోలోపల నమస్కరిస్తూనే ఉంటారు. ఈరోజు రంగు రేపు వుండదు. ఈ రోజు శాంతి రేపు వుండకపోవచ్చు. ఈనాటి సిరి రేపు తరిగిపోవచ్చు. ఈనాటి ప్రాభవం రేపటికి వుందా? బంగాళం కావచ్చు. ఈనాడు వున్న వ్యక్తి రేపటికి లేకపోవచ్చు. ఏమో సూర్యభగవానుడేం ఆదేశిస్తాడో ఏం వరాలిస్తాడో ఏం మార్పు కల్పిస్తాడో. తెల్లారితే ఎవరి కొంప తీద్దామా? అనే ఆలోచనే ఫలానా పాపారావుకి అనిపించుకునే ఘటాలుంటాయి. తెల్లవారితే ఎవరికి మేలు చేద్దామా అనే తాపత్రయమే ఆ తారక

రామారావుకి అని పొగడ్తలందుకునేవారు కొందరుంటారు. తెల్లవారితే ఎవర్ని తిట్టిపోద్దామా? ఎలా నోటి తీట తీర్చుకుందామా అనే దిక్కుమాలిన జీవితమే ఆ దేవేంద్రనాథునిది అనిపించుకునే పాపిష్టి గోపాలాలు కొందరుంటారు.

మొత్తం మీద ఒక రోజు తెల్లవారడం జీవిత గ్రంథంలో మరో పుట చేరుకోవడం అది మంచిది కానివ్వండి, చెడ్డది కానివ్వండి. ఏది చివరిపుటో ఎవరూ చెప్పుకోలేరు.

ఉదయించే సూర్యుడికొక్కడే తెలుసు ఆ రహస్యం.

Post your comments